రన్నర్‌గా మహబూబ్‌నగర్

- అండర్-19 బాలుర ఫుట్‌బాల్ టోర్నీలో విజయం 7
- బంగారు పతకం సాధించిన తులసీరామ్

రిజర్వేషన్లు ఖరారు

జీఓ ఆధారంగా బీసీలకు 42 శాతం కేటాయింపు

- లక్కీ డిప్ ద్వారా మహిళలకు 50 శాతం స్థానాలు
- కోర్టు చిక్కులు రాకుంటే.. ఇవే రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లే ఛాన్స్
- డెడికేటెడ్ కమిషన్ రిపోర్టుల ఆధారంగా ప్రక్రియ
- ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల్లో బీసీలకు భారీగా పెరిగిన ప్రాధాన్యం



మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ కార్యాలయం



మహబూబ్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఒక కీలక ఘట్టం ముగిసింది. డెడికేటెడ్ కమిషన్ రిపోర్టు ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీఓ నెంబర్ 9ని విడుదల చేసిన విషయం తెలిసిందే.. అయితే ఆ జీఓ ఆధారంగా ఆయా జిల్లాల కలెక్టర్లు అధికార యంత్రాంగంతోపాటు పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం రిజర్వేషన్లను కేటాయించారు. ఈ రిజర్వేషన్ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి, అక్కడి నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపుతారు. ఆ తర్వాత ఎన్నికలకు ముందుగా షెడ్యూల్ విడుదల చేసి.. అనంతరం నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పూర్తి స్థాయి కసరత్తును పూర్తి చేసింది. ఎన్నికల సామగ్రి, ప్రింటింగ్, బ్యాలెట్ బాక్సులను తరలించారు. అయితే బీసీ రిజర్వేషన్ల కేటాయింపుపై ప్రభుత్వం జీఓ విడుదల చేయడంతో పలువురు హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టి.. రిజర్వేషన్ల కేటాయింపు చట్టబద్ధంగా చేయాలని, అవసరమైతే ఎన్నికలను వాయిదా వేసుకోవచ్చని సూచించింది. మరి రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్తుందో వేచిచూడాలి. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాలో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లను పూర్తి చేయగా.. సర్పంచు, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి కసరత్తు జరుగుతోంది.

మహిళలకు డిప్ ద్వారా కేటాయింపు..

ముందు నుంచి అనుకున్నట్లుగానే

(మిగతా 6లో..)

జిల్లాల వారీగా ఎంపీపీ రిజర్వేషన్ల వివరాలు

జిల్లా	స్థానాలు	జనరల్	జనరల్ (మహిళ)	బీసీ	బీసీ (మహిళ)	ఎస్సీ	ఎస్సీ (మహిళ)	ఎస్టీ	ఎస్టీ (మహిళ)
మహబూబ్‌నగర్	16	2	2	4	3	2	1	1	1
నాగర్‌కర్నూలు	20	3	2	4	4	2	2	2	1
నారాయణపేట	13	2	2	3	3	1	1	1	0
గద్వాల	13	3	2	3	2	2	1	0	0
వనపర్తి	15	3	2	3	3	2	1	1	0
మొత్తం	77	13	10	17	15	9	6	5	2

జిల్లాల వారీగా జడ్పీటీసీల రిజర్వేషన్ల వివరాలు..

జిల్లా	స్థానాలు	జనరల్	జనరల్ (మహిళ)	బీసీ	బీసీ (మహిళ)	ఎస్సీ	ఎస్సీ (మహిళ)	ఎస్టీ	ఎస్టీ (మహిళ)
మహబూబ్‌నగర్	16	3	1	4	3	2	1	1	1
నాగర్‌కర్నూలు	20	2	2	4	3	4	2	2	1
నారాయణపేట	13	2	2	3	3	1	3	1	0
గద్వాల	13	2	2	3	3	2	1	0	0
వనపర్తి	15	3	2	3	3	2	1	1	0
మొత్తం	77	12	9	17	15	11	6	5	2

జడ్పీ పీఠం రిజర్వేషన్లపై గెజిట్

- ఉమ్మడి పాలమూరులో 3 బీసీలకు, ఒకటి చొప్పున ఎస్సీ, జనరల్‌కు కేటాయింపు
- తెలంగాణ రాజపత్రంలో ప్రచురించిన రాష్ట్ర ప్రభుత్వం 6

ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ న్యాయాధికారి కె.కళ్యాణ్ చక్రవర్తి 7
- హన్వాడలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

జోరువాన

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో రెండో రోజూ వర్షం

- పొంగుతున్న వాగులు.. అలుగు పారుతున్న చెరువులు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్



చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్, వడ్డెమాన్ గ్రామాల మధ్య లోలెవల్ కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

మహబూబ్‌నగర్/ నారాయణపేట/మక్తల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు అలుగులు పారుతుండగా, వాగులు పొంగిపొర్లుతున్నాయి. దాంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెంకుటిల్లు కూలి నారాయణపేట జిల్లాలో ఒక బాలుడు మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం కూడా వర్షం కురిసింది. నీసీకుంట మండలంలో ఊకచెట్టు వాగు పొంగి ప్రవహిస్తుండటంతో అమ్మాపూర్- అల్లీపూర్ మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్ద వడ్డెమాన్-దమగ్నపూర్ మధ్య మన్నెవాగు ప్రవహిస్తుండటంతో ఈ గ్రామాలకు, పర్దీపూర్ రిజర్వాయర్ కాల్వ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దమగ్నాపూర్-నెల్లికొండి, సీతారాంపేట గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. జిల్లాలోని దుంధుభీ, పెద్దమ్మ, కోయిలకొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కోయిల్‌సాగర్‌కు భారీగా వరద వస్తుండటంతో ఉదయం 7 గేట్లు తెరిచారు. సాయంత్రానికి 2 గేట్లు మూసివేసి 5 గేట్ల ద్వారా నీటిని వదిలారు. దాంతో ఇబ్రంపల్లి-కౌకుంట్ల మధ్య కౌకుంట్ల మధ్య రాకపోకలు నిలిచాయి.



భూనేడ్-కొత్తపల్లి మధ్య కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శనివారం ముసురుతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. కొత్తపల్లి మండలం భూనేడ్-కొత్తపల్లి మధ్య భూనేడ్ వాగు ఉధృతంగా పారుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండగా తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది.

పెంకుటిల్లు కూలి బాలుడి మృతి



ఆదిత్య(ఫైల్)

మక్తల్ మండలం అనుగొండలో పెంకుటిల్లు కూలిపోయి సురేష్ కుమారుడు ఆదిత్య (12)మృతి చెందాడు. గ్రామం జూరాల బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురైంది. దాంతో కొన్ని కుటుంబాలు వలస వెళ్లాయి. ఖాళీగా ఉన్న ఓ పెంకుటిల్లు వద్ద చిన్నారులు ఆడుకుంటుండగా, అది కూలిపోయి ప్రమాదం జరిగింది.

పేట ఎస్పీగా వినీత్

- హైదరాబాద్‌లోని మాదాపూర్ నుంచి బదిలీపై రాక..
- యోగేష్ గౌతమ్ రాజేంద్రనగర్ డీసీపీగా ట్రాన్స్‌ఫర్



నారాయణపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఎస్పీగా వినీత్ రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన హైదరాబాద్‌లోని మాదాపూర్ డీసీపీగా పని చేస్తున్నారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. పేటలో ఎస్పీగా పని చేసిన యోగేష్ గౌతమ్‌ను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్ డీసీపీగా బదిలీ చేశారు. ఈయన 2018 బ్యాచ్‌కు చెందిన వారు యోగేష్ గౌతమ్ జిల్లాలో దాదాపు రెండేళ్ల పాటు పని చేశారు.

నిర్లక్ష్యం చేస్తే.. ప్రాణాలకు ముప్పు



- నేడు ప్రపంచ రేబిస్ వ్యతిరేక దినం 7

బంగారు దుకాణంలో చోరీ

- 3.5 కేజీల వెండి, తులం బంగారం అపహరణ 7
- మక్తల్ పట్టణంలోని మహాలక్ష్మి జ్యువెల్లరీ దుకాణంలో ఘటన

గాంధీ స్ఫూర్తితో కొండాలక్ష్మణ్ పోరాటం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం తదితరులు

పాలమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని.. అవే విలువలతో ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్ ఏరియాలో ఆయన విగ్రహానికి కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతనం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ చేసిన సేవలు, త్యాగాలు గుర్తు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బెక్కరి అనిత, డీసీసీ కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, పాష, మునీర్, చిన్న, తిరుమల వెంకటేష్ పాల్గొన్నారు.

పర్యాటకంలో అగ్రగామిగా నిలుపుదాం

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో నారాయణపేట జిల్లాను అగ్రగామిగా నిలుపుదామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లాలోని కృష్ణ మండలం ముడుమాల్ గ్రామం వద్ద గల నిలువు రాళ్ల దేశంలోనే అతి పెద్దవని, ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముడుమాల్ నిలువు రాళ్లకు యునెస్కో శాశ్వత గుర్తింపు లభిస్తే ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం దక్కుతుందన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంతంలో లే అవుట్‌తో పాటు ఒక మ్యూజియం, అన్ని వసతులతో కూడి కాటేజీలను నిర్మిస్తామన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందించారు. మక్తల్ ఆధ్యకళ నాట్య మండలి చిన్నారుల భరత నాట్య నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వారిని కలెక్టర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ, టూరిజం శాఖ అధికారి ఎంఏ రషీద్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, కలెక్టరేట్ ఏవో జయసుధ, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖలీల్ పాల్గొన్నారు.



ఐదు తరగతులకు ఒకే టీచర్ ఉన్న ఊట్కూర్ మండలం చిన్నపొర్ల ప్రాథమిక పాఠశాల

438 పోస్టులు ఖాళీ

- పదోన్నతులతో 'పేట' జిల్లాలో టీచర్ పోస్టులు ఖాళీ
- విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకం
- 320 మంది విద్యా వలంటీర్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను నియమించాలని ప్రతిపాదనలు

నారాయణపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియతో నారాయణపేట జిల్లాలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల భవితవ్యం ఏంటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పదోన్నతులతో జిల్లా వ్యాప్తంగా 438 పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 337 ఉండగా వాటిలో 18,096 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు 86 ఉండగా 9,989 మంది, ఉన్నత పాఠశాలలు 75 ఉండగా 22,319 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

వలంటీర్ల కోసం ప్రతిపాదనలు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 112కు 112 మంది ఉన్నారు. ఎస్‌జీటీలు 1,191 గాను 860 మంది పని చేస్తున్నారు. 331 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్స్ 1,038 మందికి 939 మంది పని చేస్తుండగా 99 పోస్టులు, జీహెచ్‌ఎంలు 63 మందికిగాను 55 మంది పని చేస్తుండగా 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భాషా పండితులు 29 మందికి 29 మంది ఉన్నారు. 438 పోస్టులు ఖాళీలు ఉండగా, కొరత తీవ్రంగా ఉన్న చోట 76 మంది ఎస్‌జీటీలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేశారు. దాంతో 320 మంది విద్యా వలంటీర్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను నియమించాలని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వారిని నియమించి, చదువుకు ఇబ్బందులు కాకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సస్యరక్షణ చర్యలతో పత్తిని కాపాడుకోవచ్చు

- పాలెం శాస్త్రవేత్తలు



భూత్పూర్ శివారులో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

భూత్పూర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సస్య రక్షణ చర్యలు పాటించడం పత్తి పంటను కాపాడుకోవచ్చని పాలెం శాస్త్రవేత్తలు చెప్పారు. అధిక వర్షాల వల్ల పత్తి, మొక్కజొన్న, జొన్న, ఇతర పంటలు పెద్ద అధికంగా దెబ్బతినట్లు వారు చెప్పారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ మాధురి, డాక్టర్ కే. కల్యాణి పర్యటించారు. పత్తి, వరి, ఇతర పంటలను ఎలా కాపాడుకోవాలోనని వివరించారు. పత్తి కాయ కుళ్లు తెగులును నివారించడానికి సస్యరక్షణ చర్యలను తెలిపారు.



అలంపూరులో కాత్యాయనీ దేవిగా దర్శనం ఇస్తున్న జోగులాంబ అమ్మవారు



అన్నపూర్ణేశ్వరి అలంకరణలో జములమ్మ



కొత్తకోటలో భవానీ శంకర ఆలయంలో లలితా దేవిగా దర్శనం ఇచ్చిన అంబా భవానీ



అచ్చంపేటలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితాదేవిగా అమ్మవారు



అన్నపూర్ణాదేవి అలంకరణలో అయిజ కన్యకా పరమేశ్వరిదేవి



జడ్చర్లలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో వారాహి అలంకరణ..



కల్వకుర్తిలో లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో వాసవిమాత

జగన్మాతా.. నమోనమామి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తుల పూజలందుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరులో కాత్యాయనీ దేవిగా జోగులాంబ అమ్మవారు దర్శనం ఇచ్చారు. అన్నపూర్ణేశ్వరి అలంకరణలో జములమ్మ, కొత్తకోట, అచ్చంపేట ప్రాంతాల్లో లలితా దేవీగా, కల్వకుర్తిలో లలితా త్రిపుర సుందరీదేవిగా, జడ్చర్లలో వారాహి దేవిగా అమ్మవారిని అలంకరించారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్

బాచారం అడవిలో పునరావాసం

» స్థలాన్ని పరిశీలించిన డీఎఫ్‌ఓ రోహిత్‌గోపిడీ



బాచారం అటవీ ప్రాంతంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ రోహిత్‌గోపిడీ

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో పులుల సంతతి పెరగడం, సంచారం ఎక్కువ కావడంతో చెంచుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. నల్లమల అడవుల్లో వన్యమృగాలు స్వేచ్ఛగా సంచరిస్తుండడంతో అప్పర్‌ప్లాట్ గ్రామాల ప్రజలను మైదాన ప్రాంతానికి తరలించేందుకు అటవీశాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. అప్పర్‌ప్లాట్ ప్రజలకు నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం బాచారం అడవిలో పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శనివారం జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడీ, ఆ శాఖ ఇతర అధికారులు సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామస్థులతో కలిసి బాచారం సమీపంలోని అడవిలో పునరావాసం కోసం స్థల పరిశీలించారు. గతంలో రెండుమార్లు స్థలాన్ని అటవీ అధికారులు పరిశీలించారు. పునరావాసంలో భాగంగా రెండు విడతల్లో కలిపి మొత్తం 1167 కుటుంబాలకు బాచారం అడవిలో పునరావాసం కల్పించనున్నారు. మొదటి విడతలో సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాల కుటుంబాలకు ఇక్కడ ప్రభుత్వం పునరావాసం కల్పించనున్నారు. రెండవ విడతలో వటవర్లపల్లి, కొల్లంపెంట, తాటిగుండాల గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. పునరావాసం ప్రక్రియను అటవీశాఖ అధికారులు ముమ్మరం చేశారు. డీఎఫ్‌వో వెంట లింగాల ఫారెస్టు రేంజర్ ఈశ్వర్, ఫారెస్టు అధికారి వెంకటేశ్, ఇతర అధికారులు, సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామస్థులు రాములు, వెంకటయ్య, వావిళ్లశ్రీను, సంతోష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

మరికల్/హన్వాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేటట్లు లేదు. యూరియా లోడ్లు వస్తూనే ఉన్నాయి.. అయిపోతూనే ఉన్నాయి. శనివారం ధన్వాడ, మరికల్ మండల కేంద్రాల్లో యూరియా కోసం రైతన్నలు ఉదయం 5 గంటల నుంచి వర్షం లేక చేయకుండా క్యూలైన్‌లో నిలబడ్డారు. మరికొందరు రైతులు ఈ వర్షం ఎంత అనే భావనతో పలువురు రైతులు గొడుగులు చేత పట్టుకొని క్యూలో నిలిచారు. ప్రతీ మండలానికి 600 బస్తాల యూరియా వచ్చింది. కాని రైతులు మాత్రం రేట్టింపు ఉన్నారు. మరికల్ మండలానికి గత సంవత్సరం 2 వేల మెట్రిక్ టన్నులు యూరియా రావడంతో రైతులందరికీ అందించారు. ఈ సంవత్సరం 2,200 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి వచ్చినా ఇంకా సరిపోవడం లేదు. రైతులు గత సంవత్సరం కంటే రెటింపు వరిసాగు చేయడంతో యూరియా అందరికి సమయానికి అందడం లేదు.

హన్వాడ ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం గోదాం ముందు శనివారం యూరియా కోసం వర్షంలో అన్నదాతలు క్యూ కట్టారు. 900 బస్తాల యూరియా రావడంతో క్యూలో ఉన్న రైతులందరికీ అందింది. చివరలో కొందరికి అందలేదని రైతులు వాపోయారు. అయితే వర్షం కారణంగా రైతులు తక్కువగానే వచ్చారు. ఈ నెల 24 తేదీన ఇచ్చిన టోకెన్లతో పాటు ఈ రోజు వచ్చిన రైతులకు యూరియా అందింది.

క్రెడిట్ కార్డులో డబ్బులు మాయం

రాజాపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు మాయం కావడంతో శనివారం కేసు నమోదైన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ శివనాదం వివరాల ప్రకారం.. మండలంలోని మల్లేపల్లి గ్రామనికి చెందిన లింగమాచారికి చెందిన ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు నుంచి 25న మూడు సార్లు రూ. 30,000 వేల చొప్పున రూ.90,000 డెబిట్ అయినట్లు, ఫ్లిప్కార్ట్ ఇంటర్న్ నుంచి మెసేజ్ వచ్చింది. అదే రోజు అదే వ్యక్తికి చెందిన స్టేట్ బ్యాక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డు నుంచి ఉదయం 10.07 గంటలకు మూడు సార్లు రూ.30,000 వేల చొప్పున రూ.90,000 డెబిట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ. 1,80,000 వేలు మాయం అయినట్లు పేర్కొన్నారు. లింగమాచారి సైబర్ క్రైం 1960 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు, అదే విధంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె

ఉండవల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉండవల్లి మండల పరిధిలోని గ్రామాల్లోని పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో శనివారం బొంకూరు గ్రామానికి చెందిన పింజారి షాకినబీ నివాసంలోని మట్టి మిద్దె అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో షాకినబీ ఇంటి బయట ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్షాల వల్ల గోడలు బలహీనపడి కూలిపోయాయి. అధికారులు కూలిపోయిన ఇళ్లను పరిశీలించి ప్రభుత్వం నుంచి తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆసుపత్రిని సందర్శించిన బృందం సభ్యులు

కల్వకుర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు శనివారం పరిశీలించారు. డాక్టర్ సుబోద్, రామలక్ష్మి తోపాటు 10మందితో కూడిన బృందం ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు. 108అంబులెన్స్, 102 అంబులెన్స్‌లను క్షుణ్ణంగా పరి శీలించారు. వైద్యులు యశోద, శివ, పాండురంగ, స్వప్న, శిరీషషకీల్ నర్సింగ్ సూపరింటెండెంట్ శిరో మణి, ఫార్మాసిస్టు మైకేల్ మనోహర్, సీనియర్ న ర్సింగ్ ఆఫీసర్స్ సునీత, జాయ్‌మెర్సి, బాలమణి, అనిత, పారామెడికల్ సిబ్బంది రహీం, రఘు, వెంకట స్వామి, రాహుల్, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

రూ.20 కోసం..ప్లీహము పోయేలా దాడి

» శస్త్రచికిత్స చేసి తొలగించిన వైద్యులు

» విద్యార్థిపై దాడి కేసులో ముగ్గురి రిమాండ్..మరొకరు పరారీ

» వివరాలు వెల్లడించిన సీఐ అప్పయ్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పయ్య, చిత్రంలో నిందితులు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేవలం రూ.20 కోసం గంజాయి ముఠా విచక్షణరహితంగా దాడి చేసి ఓ విద్యార్థి శరీరంలోని ఓ అవయవం కోల్పోయేలా చేశారు. కళాశాల నుంచి తన మానాన ఇంటికి వెళ్లే దారిలో అడ్డగించిన గంజాయి బ్యాచ్ రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేయగా, ఆ డబ్బులు తమ వద్ద లేవని చెప్పాడు. దీంతో ఆ ముఠా విద్యార్థి కడుపులో పిడిగుద్దులు గుద్దగా రక్తస్రావం అయింది. ఆసుపత్రికి వెళితే ప్లీహం దెబ్బతినడంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి ఆ అవయవాన్ని తొలగించారు. ఈ కేసులో పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా మరో వ్యక్తి పరారీలో ఉన్నాయి. వన్‌టౌన్ సీఐ తన పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన సాయికుమార్ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ థర్డ్‌ఇయర్ చదువుతున్నాడు. ఈనెల 16న కళాశాల వదిలిన అనంతరం స్నేహితులతో కలిసి బస్టాండ్ వచ్చేందుకు అడ్డదారి బండ్లగేరి మీదుగా నడుచుకుంటూ వెళుతున్నారు. కళాశాల వెనక గణేశ్ నగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శివ, మల్లేష్, హర్ష అనే వ్యక్తులు విద్యార్థులను అడ్డగించి రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ వద్ద బస్‌పాస్ తప్పా డబ్బులు లేవని చెప్పి వెళుతుండగా అడ్డగించి సాయికుమార్‌పై తీవ్రంగా దాడిచేశారు. శివ వేలిక ఉన్న ఉంగరంతో బలంగా కడుపులో గుద్దగా రక్తస్రావం అయింది. గాయాలైన సాయికుమార్‌ను ఆసుపత్రిలో చేర్చగా ప్లీహం దెబ్బతినడంతో తొలగించాల్సి వచ్చింది. ఈ కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిని శనివారం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపించారు. ఈ కేసులో నాని అనే మరో నిందితుడు పరారీలో ఉన్నారన్నారు. అయితే పదిరోజులక్రితం జరిగిన ఈ ఘటనలో ఏడెనమిది మంది కలిసి దాడి చేశారని, బాధితుడి తల్లిదండ్రులు చెబుతుండగా పోలీసులు నలుగురే ఉన్నట్లు తేల్చారు.

అయితే డబ్బుల కోసం గంజాయి ముఠా ఈ దారుణానికి ఒడిగట్టినట్లుగా ఇప్పటికే సామాజిక మాధ్యమాలలో పెద్దఎత్తున ప్రచారం జరిగినా పోలీసులు మాత్రం గంజాయి బ్యాచ్‌గా నిర్ధారించలేదు.

నిందితులు గంజాయి, ఆల్కాహాల్ తీసుకున్నారా అన్న విషయాలపై పరీక్షల కోసం జనరల్ ఆసుపత్రికి పంపించామని, దాని తరువాత చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతుండటం గమనార్హం.

కుండపోత



వర్షాలతో ఊట్కూర్ మండలం బిజ్వార్‌లో నల్లబడ్డ పత్తి పంట

» గట్టులో అత్యధికంగా 118.9 మిల్లీమీటర్ల వర్షం

మహబూబ్‌నగర్/ గద్వాల/ మక్తల్/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండ్రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు అలుగులు పారుతున్నాయి. జిల్లా అంతటా జలకళను సంతరించుకున్నది. సీసీకుంట మండలంలోని ఊకచెట్టు వాగు పొంగిపొర్లుతుండటంతో పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం వరకు చినుకులు పడ్డాయి.

మహబూబ్‌నగర్ జిల్లా సీసీకుంట మండలంలో 101 మి.మీ. వర్షపాతం నమోదైంది. దేవరకద్రలో 93.6, కౌకుంట్లలో 93, మహ్మదాబాద్‌లో 89.4, హన్వాడలో 82.5, గండీడ్‌లో 73, బాలానగర్‌లో 58.3, మూసాపేటలో 55.9, భూత్పూర్‌లో 54.5, మహబూబ్‌నగర్ అర్బన్‌లో 53 మి.మీ. వర్షపాతం నమోదైంది. గద్వాల జిల్లాలో గత అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు జామున వరకు వర్షం దంచికొట్టింది. గట్టులో అత్యధికంగా 118.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అయిజలో 109.4 మిల్లీమీటర్లు, మల్దకల్‌లో 98.4, ధరూర్‌లో 93.4, గద్వాలలో 91.8, రాజోలిలో 91.8, ఇటిక్యాలలో 82.2, వడ్డేపల్లిలో 83.6, కేటీదొడ్డిలో 75.6, మానవపాడులో 50.2, ఆలంపూర్‌లో 51.6, ఉండవల్లిలో 46.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పంట పొలాలు నీట మునిగాయి. నారాయణపేట జిల్లా నర్వ మండలంలో 71.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొత్తపల్లిలో 56.0, మరికల్‌లో 42.5, మద్దూర్‌లో 39.5, ఊట్కూర్‌లో 35.0, కోస్గిలో 34.5, దామరగిద్దలో 32.8, మాగనూర్‌లో 29.0, నారాయణపేటలో 27.5, ధన్వాడలో 27.3, కృష్ణలో 25.8, గుండుమాల్‌లో 24.3, మక్తల్ మండలంలో 21.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో 63.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పెంట్లవెల్లి మండలంలో 61.2, బిజినేపల్లిలో 59.8, తాడూరులో 43.2, తిమ్మాజిపేటలో 40.6, కోడేరులో 38.2, పెద్దకొత్తపల్లిలో 36.2, తెల్కపల్లిలో 31.8, నాగర్‌కర్నూల్‌లో 29.0, ఉప్పునుంతలలో 26.4, లింగాలలో 25.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలో 27.7 మి.మీ. వర్షపాతం నమోదయింది.

పారుతున్న గుండం అలుగు

మన్ననూర్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్య ప్రాంతంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అడవిలో గల దుర్వాసుల చెరువు ఫీడర్ చానల్‌లో గల గుండం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పర్హాబాద్ సమీపంలో గల పిచ్చకుంట్లోని చెరువు నిండి అలుగు పారుతుండడంతో గుండం వాగులో రెండు నెలలుగా నీరు భారీగా ప్రవహిస్తోంది. శ్రీశైలం-హైదరాబాద్ రహదారి పక్కన లొద్దిమల్లయ్య క్షేత్రం వెళ్లే దారిలో ఈ వాగు కనిపిస్తుండడంతో శ్రీశైలం వెళ్లి వచ్చే పర్యాటకులు ఈ నీటి ప్రవాహాన్ని చూస్తూ ఆహ్లాదాన్ని పొందుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న గుండం వాగు

రిజర్వేషన్లు ఖరారు

(5వ పేజీ తరువాయి)

రొటేషన్ పద్ధతిలో కాకుండా ఈసారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మహిళలకు ఆయా కేటగిరీల వారీగా లక్కీడిప్ పద్ధతిలో రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఒక్కో కేటగిరి స్థానాలను తీసుకుని అందులో మండలాల వారీగా డిప్ తీశారు. అయితే గతంతో పోల్చితే చాలా వరకు రిజర్వేషన్లు మారాయి. ప్రజలు ఆశించిన దానికి భిన్నంగా వచ్చాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 77 జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. బీసీలకు అత్యధిక రిజర్వేషన్లు కల్పించడంతో వారి ప్రాధాన్యం గణనీయంగా పెరిగింది. బీసీ జనరల్‌కు 17 స్థానాలు దక్కగా.. బీసీ మహిళకు 15 స్థానాలు కేటాయించారు. మొత్తం కలిపి 77 జడ్పీటీసీ స్థానాల్లో 32 స్థానాలు బీసీలకే వచ్చాయి. ఎంపీపీ స్థానాలు కూడా 77 ఉండగా, అందులో కూడా బీసీలకు 32 స్థానాలు లభించాయి. అయితే రిజర్వేషన్ల కేటాయింపులో పూర్తి పారదర్శకతను పాటించినట్లు ప్రస్తుతం వచ్చిన కేటాయింపులను చూస్తే అర్థమవుతోంది. ఆయా ఎమ్మెల్యేల దగ్గర ఉన్న ప్రధాన అనుచరులు కూడా ఆశలు పెట్టుకున్న స్థానాలు వారు అనుకున్నట్లు రిజర్వ్ కాలేదు. దీంతో వారు మరో పదవి కోసం వేచిచూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

అంచనాలు తారుమారు..

షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడుతూ వస్తుండటంతో చాలామంది ఆశావహులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గతంలో ఉన్న ప్రజాప్రతినిధులు ఈసారి కూడా రిజర్వేషన్లు మారకపోతే తామే పోటీలో ఉంటామనే ధీమాతో గ్రామాల్లో తిరుగుతుండగా.. రిజర్వేషన్లు మారితే తాము కూడా పోటీ చేయవచ్చని కొత్తవారు కూడా ఆశపడ్డారు. అయితే ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ రిపోర్టు, కులగణన ఆధారంగా చేసుకుని రిజర్వేషన్లు ఖరారు చేయడం, గతంలో ఉన్న రిజర్వేషన్లను రొటేషన్ చేయడంతో చాలామంది ఆశలు గల్లంతయ్యాయి. అసలే ఆశల్లో లేనివారికి కొత్త ఆశలు చిగురించాయి. తక్కువ ఓట్లు ఉన్న సామాజిక వర్గానికి కూడా కొన్ని గ్రామాల్లో రిజర్వేషన్లు దక్కడంతో అందులో ఎవరు పోటీకి అర్హులవుతారోనని నాయకులు వెతుకుతున్నారు. కోర్టు చిక్కులు లేకుండా ఎన్నికల ప్రక్రియ జరిగితే ఈ రిజర్వేషన్ల ఆధారంగానే అభ్యర్థులు పోటీలో నిలవనున్నారు.

జడ్పీ పీఠం రిజర్వేషన్లపై గెజిట్

» ఉమ్మడి పాలమూరులో 3 బీసీలకు, ఒకటి చొప్పున ఎస్సీ, జనరల్‌కు కేటాయింపు

» తెలంగాణ రాజపత్రంలో ప్రచురించిన రాష్ట్ర ప్రభుత్వం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం భారీ కసరత్తు తర్వాత ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్లు ఖరారు చేయగా.. వాటిని ఆధారంగా చేసుకుని ఆయా జిల్లా పరిషత్‌ల ఛైర్‌పర్సన్ పదవులకు కూడా రిజర్వేషన్లు ఖరారు చేస్తూ తెలంగాణ రాజపత్రంలో ప్రచురించింది. గత ఎన్నికల్లో రెండు జనరల్ స్థానాలు, రెండు బీసీ మహిళలకు, ఒకటి ఎస్సీ జనరల్ కేటాయించగా.. ఈసారి ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తుండటంతో మూడు బీసీలకు, ఒకటి జనరల్, ఒకటి ఎస్సీలకు దక్కింది. మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ గతంలో జనరల్ మహిళకు కేటాయించగా.. ఈసారి బీసీ మహిళకు రిజర్వేషన్ చేశారు. నాగర్‌కర్నూలు స్థానం గత ఎన్నికల్లో ఎస్సీ జనరల్‌కు కేటాయించగా.. ఈ సారి బీసీ మహిళకు, వనపర్తిని గతంలో జనరల్‌కు కేటాయించగా ఈసారి బీసీ మహిళకు, గద్వాలను గతంలో బీసీ మహిళకు ఇవ్వగా, ఈసారి ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ చేశారు. నారాయణపేట జిల్లా పరిషత్ గతంలో బీసీ మహిళకు కేటాయించగా.. ఈసారి జనరల్ మహిళకు కేటాయించారు. బీసీలకు కేటాయించిన మూడు స్థానాల్లో కూడా మహిళలకే అవకాశం దక్కింది. అన్ రిజర్వ్‌గా ఉంచిన నారాయణపేట కూడా మహిళకే రిజర్వ్ చేశారు.

ఒక్క గద్వాల మినహా మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలు మహిళలకే దక్కాయి.

ఆగని సైఫన్ల మోత

» రెండో రోజు కూడా ఆత్మకూర్ వనపర్తిలకు రాకపోకలు బంద్



రామన్‌పాడు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

మదనాపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, ప్రాజెక్టులు పూర్తిగా నిండి జలకళను సంతరించుకున్నాయి. శనివారం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టు ఆటోమెటిక్ సైఫన్లు అయిదు తెరుచుకొని నాలుగువేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేస్తున్నాయి. అదే విధంగా రామన్‌పాడు ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తి 36వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుంది.

కొనసాగుతున్న నీటి విడుదల

మక్తల్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం 2 గేట్లు ఎత్తి అధికారులు నీటి విడుదల కొనసాగింది. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద నీటి ఉధృతి పెరగడంతో శనివారం రెండు గెట్లతో దిగువకు నీటి విడుదల కొనసాగింది. జలాశయంలోకి 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1000 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని, రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.64 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈఈ సురేష్ తెలిపారు.

కోయిల్‌సాగర్ 5 గేట్ల ఎత్తివేత

దేవరకద్ర,(ఆంధ్రజ్యోతి): కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారింది. దీంతో శనివారం ఉదయం ప్రాజెక్టు అధికారులు ఉదయం 5 గేట్లను తెరిచి 10,500 వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. పై నుంచి నీరు ఉధృతంగా రావడంతో మొత్తం, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోయిల్‌కొండ, అంకిళ్ల, వాగుల నుంచి నీరు రావడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టును శనివారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సందర్శించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శ్రీనువాసులు, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఆర్‌ఐ శరత్ తదితరలు ఉన్నారు.

దుందుభీ ఉగ్రరూపం..

తాడూరు,(ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దుందుబీ నది ఉగ్రరూపం దాల్చింది. శనివారం మండలంలోని పాపగల్ మొదలుకుని సిర్సవాడ మీదుగా గుట్టలపల్లి గ్రామం వరకు నది పరివాహక ప్రాంతం వెంట ఉధృతమైంది. నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో నదిలోకి ఎవరూ వెళ్లకూడదని ఎస్ఐ గురుస్వామి ఆ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

●అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి): డిండి ప్రాజెక్టు ఎగువ నుంచి శనివారం 7200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో దుందుభీ నది నుంచి అదే స్థాయిలో దిగువకు నీరు ప్రవహిస్తున్నది. ఈ నేపథ్యంలో చెరువులు కుంటలు నిండు కుండలా మారి అలుగులు పారుతున్నాయి. 765 జాతీయ రహదారి సమీపంలో డిండి ప్రాజెక్టు ఉండడంతోఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు వాహణదారులు దుందుభీ నీటి ప్రవాహాన్ని చూసి ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

కృష్ణ, బీమా నదులు..

కృష్ణ(ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాజెక్టుల నుంచి దిగువ ఉన్న కృష్ణ, బీమా నదులకు 4 లక్షల 60వేల క్యూసెక్కుల వరద నీరు వదిలినట్లు మండల తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. అదే విధంగా ఆల్మట్టి నారాయణపూర్ కోయిన ప్రాజెక్టుల నుంచి దాదాపు 50వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉందని తహసీల్దార్ అన్నారు. వరద నీటితో శనివారం నదులు ఉగ్రరూపం దాల్చాయి. కృష్ణ బీమా నదుల ఒడ్డున ఉన్న దత్తభీమేశ్వర దేవాలయం వరద నీరు తాకింది. కృష్ణ రైల్వే వంతెన వద్ద ఉన్న పుష్కర ఘాట్లు, కృష్ణవేణి విగ్రహం పూర్తిగా వరద నీటిలో మునిగిందని ఆయన పేర్కొన్నారు.

బ్రిడ్జి లేక నరకయాతన

» పులిజాల, మల్కాపూర్ గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



కందనూలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బ్రిడ్జి లేకపోవడంతో పుల్జాల, మల్కాపూర్, తాళ్లపల్లి, నడిగడ్డ గ్రామా ల ప్రజలు నరకయాతన పడుతున్నారు. అధిక వర్షాలతో పాటు ఇటీవల ఎడతెరిపి లే కుండా కురుస్తున్న వర్షాలకు నాగర్‌కర్నూల్ మండలంలోని మల్కాపూర్, పులిజాల గ్రామాలతో పాటు తెలకపల్లి మండలంలోని నడిగడ్డ, తాళ్లపల్లి గ్రామాల ప్రజలు తమ గ్రామాలకు వెళ్లాలంటే నానా తంటాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. మల్కాపూర్ స్టేజీ నుంచి మల్కాపూర్ వెళ్లే గ్రామానికి మధ్య స్టేజీ సమీపంలో వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఆ గ్రామాల ప్రజలు ఆర్డీవో ఆఫీస్ రోడ్డుకు వెళ్లి.. అటు నుంచి వారి గ్రామాలకు వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. మట్టి రోడ్డు కావడంతో గుంతలమయమై మనుషులు కూడా నడి చివెళ్లలేని పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతి నిధులు మా రోడ్డును పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర వర్షాలు కురిస్తే తెలకపల్లి మండలంలోని చిన్నముద్దునూర్ మీదుగా పులి జాల, నడిగడ్డ, తాళ్లపల్లి, మల్కాపూర్ గ్రామాలకు వెళ్లాలంటే 20కిలో మీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి మల్కాపూర్ సమీపంలో రోడ్డుపై పారుతున్న ప్రదేశంలో బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

మా గోడు పట్టించుకునే నాథుడు కరువయ్యాడు

మల్కాపూర్ దగ్గర రోడ్డుపై బ్రిడ్జి నిర్మించ కుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మా గోడును పట్టించుకో వడం లేదు. తక్షణమే బ్రిడ్జి నిర్మించి మా నా లుగు గ్రామాల ప్రజలను ఆదుకోవాలి.

- దేవేందర్‌గౌడ్, మల్కాపూర్

క్రైం కార్నర్

పిచ్చికుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

రాజోలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పిచ్చి కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలైన ఘటన రాజోలి మండలంలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం రాజోలిలోని పునరావాస కాలనీలో ఓ బాలుడిపై కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం తీకుకెళ్లగా అక్కడ సరైన మందులు లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిద్దమ్మ అనే మరో వృద్ధురాలికి కోతి దాడి చేయడంతో కాలుకి తీవ్రం గాయపడటంతో ఆమె కూడా చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. అదేవిధంగా మండలంలోని పచ్చర్ల గ్రామంలో ఒకే పిచ్చి కుక్క ముగ్గురిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుక్క కాటు చికిత్సకు అవసరమయ్యే మందులు ప్రతీ గ్రామంలో అందుబాటులో, ప్రతి పీహెచ్‌సీలో అందుబాటులో ఉండే విధంగా చూడాలని, ప్రజలు కోరతున్నారు.

బంగారం దుకాణంలో చోరీ

» 3.5 కిలోల వెండి, తులం బంగారం అపహరణ

మక్తల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని మహాలక్ష్మి జువెల్లరీ దుకాణంలో చోరీ జరిగింది. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకుంది. హైదరాబాద్, రాయచూరు జాతీయ రహదారిపై మహాలక్ష్మి జువెల్లరీ దుకాణం ఉండటంతో దోపిడీ దొంగలు గోడ పగలగొట్టి అక్కడి నుంచి షాప్‌లోకి దూరారు. గ్యాస్ కట్టర్ల సాయంతో దుకాణంలోని లాకర్‌లో ఉన్న 3.5కేజీల వెండి, తులం బంగారు ఆభరణాలు చోరీ చేసి ఉండాయించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు.



గోడ వెనకిభాగంలో రంధ్రం చేసిన దృశ్యం

గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మానవపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మానవపాడు మండలంలోని జల్లాపురం స్టేజి సమీపంలో యూటర్న్ దగ్గర గుర్తు తెలియని కారు బైకును ఢీకొట్టడంతో వక్తకి గాయాలైనట్లు తెలిపారు. ఉండవల్లి మండలంలోని మారమునగాల గ్రామానికి చెందిన రామకృష్ణ బైక్‌పై సొంత పని నిమిత్తం వెళ్లి గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కారు బైక్‌ను ఢీకొనడంతో కుడికాలు విరిగి, గాయాలు కవడంట 108 సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఎర్రవల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ మురళి కథనం ప్రకారం ఆగిఉన్న ట్యాంకర్‌ను బొలెరోవాహనం ఢీకొట్టడంతో బొలెరోలో ఉన్న తొమ్మిది మందిలో ఇద్దరికి గాయాలైనట్లు తెలిపారు. వెనుక వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు అదుపుతప్పడంతో అందులో ప్రయాణిస్తున్న 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారికి చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లా వాసి మృతి


44 గొర్రెల మృతితో రూ.5 లక్షల నష్టం

మూసాపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో గొర్రెల లోడు బొలెరో వ్యాను వెనకి నుంచి ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందాడు. ఈ సంఘటన అడ్డాకుల మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అడ్డాకుల ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాల్లోకి వెళ్లగా ఏపీ రాష్ట్రంలోని సత్యసాయి జిల్లా చెన్నకొత్తపల్లి మండలం దావాజీపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ(62) తాను పెంచుకున్న 84 గొర్రె పోట్టెళ్లను తన సొంతూరు దావాజీపల్లి నుంచి హైదరాబాద్‌లో పండుగకు విక్రయించడానికి బొలెరో వ్యాన్‌లో తరలిస్తున్నాడు.

శనివారం తెల్లవారుజామున 44వ జాతీయ రహదారి అడ్డాకుల స్నేహ కోళ్ల పరిశ్రమ సమీపంలో ముందుగా వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బొలెరో వ్యాన్ వెనుకవైపు ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌లోని ఆదినారాయణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే విధంగా అదే జిల్లాకు చెందిన రామగిరి మండలం సద్దాంపల్లికి చెందిన డ్రైవర్ కమతం కాటమేశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. వ్యాన్‌లోని 44 గొర్రెలు మృతి చెందగా సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లింది. గాయపడిన డ్రైవర్‌ను చికిత్సకై అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు ఆదినారాయణకు భార్య ఆదెమ్మ, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల మేరుకు విచారించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

మదనాపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని ఊకచెట్టు వాగుపై ఉన్న లోలెవెల్ వంతెనపై వరద నీరు ప్రవహిస్తున్నది. ఇది తెలియని నవాబ్ పేట మండలం కారుకొండ గ్రామానికి చెందిన కురుమూర్తి శనివారం మధ్య రాత్రి రెండు గంటల సమయంలో మదనాపురం నుంచి చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద కు వెళ్లడానికి వాగు దాటబోయాడు. వాగు ఉధృతికి అతను ముందుకు పోలేక పక్కనే ఉన్న రేలింగ్‌ను పట్టుకొని కేకలు వేశాడు. ఇది గమనించిన పోలీసు లు వెంటనే ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటికి లాగారు.



జేసీబీ సహాయంతో బయటకు వస్తున్న కురుమూర్తి

వాగులో కొట్టుకుపోయిన బైకు

కోడేరు,(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి వాగు దాటుతూ వరదలో బైకుతో పాటు కొట్టుకుపోగా స్థానికులు గమనించి అతనితో పాటు బైకును ఒడ్డుకు చేర్చారు. ఈ సంఘటన శనివారం కోడేరు మండల పరిధిలోని బావాయిపల్లిలో చోటు చేసుకుంది. వనపర్తి నుంచి పెద్దకొత్తపల్లి వెళ్తున్న వ్యక్తి వాగు దాటుతూ వరదలో బైకుతో పాటు ఆయన కొట్టుకుపోగా స్థానికులు గమనించి అతన్ని కాపాడి బైకును ఒడ్డుకు చేర్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి వెంటనే వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

నిర్లక్ష్యం చేస్తే.. ప్రాణాలకు ముప్పు!

రేబిస్‌తో జాగ్రత్త సుమీ

» పిచ్చికుక్కలతో వ్యాపిస్తున్న వ్యాధి
» ముందు జాగ్రత్తగా యాంటీ రేబీస్ టీకా
» ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో వ్యాక్సిన్
» నేడు ప్రపంచ రేబిస్ వ్యాధి వ్యతిరేక దినం



వీధుల్లో పిచ్చికుక్కలు



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధుల్లో అతి ప్రమాదకరమైనది రేబిస్. ప్రధానంగా పిచ్చికుక్క కాటు వలన కలిగే ఈ వ్యాధి ప్రాణాంతకమైంది. ప్రస్తుతం జిల్లాలో పిచ్చికుక్కల స్వైర విహారం కూడా ఎక్కువైంది. ఇటీవల జడ్చర్లలో వరుసగా దాదాపు 15 మందికి ఒకేరోజు రేబిస్ సోకిన కుక్కలు కరిచాయి. ఇటీవల కుక్కకాటు బాధితులు కూడా ఎక్కువయ్యారు. వాటిని నియంత్రించాల్సిన మునిసిపాలిటీ, పశుసంవర్ధక శాఖలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా పిచ్చికుక్కల స్వైర విహారం రోజు రోజుకు పెరుగుతున్నది. రేబిస్ సోకిన కుక్కలు మనుషులను కరవడం వలన ఈ వ్యాధి సోకుతుంది. అందువలన ముందు జాగ్రత్తగా వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేయించడంతో పాటు కుక్క కరిచిన ప్రతీ ఒక్కరికి ఈ వ్యాక్సిన్ వేయించాలని వైద్యులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, పశువులకు కూడా ఈ వ్యాధి సోకి చాలా సంఖ్యలో మూగజీవాలు చనిపోతున్నందువలన వాటికి కూడా వ్యాక్సిన్ వేయిస్తే మూగజీవాల ప్రాణాలు రక్షించేందుకు అవకాశం ఉంటుంది.

మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా గత జనవరి నుంచి ఇప్పటి వరకు 3,231 మంది కుక్క కాటుకు గురయ్యారు. ఇందులో 8,091 మంది నాలుగు డోసులు వేసుకున్నారు. యాంటి రేబీస్ వ్యాధి వ్యాక్సిన్ వేయించడంతో ఎలాంటి మరణాలు సంభవించలేదు.

అయితే ప్రతీ ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా ఈ వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచారు. నేడు రేబిస్ వ్యాధి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

పశువుల్లో కూడా రేబిస్ వ్యాధి...

రేబిస్ పశువులకు కూడా సోకుతుంది. గేదెలు, లేదా ఆవులు చొంగ కార్చడం, యజమానిని గుర్తుపట్టకపోవడం, తలను గోడకు కొట్టుకోవడం, కుక్కలను పెంచే షెడ్‌లో ఇతర వస్తువులను ఢీ కొట్టడం, తరచుగా మూత్రం పోయడం, గట్టిగా అరవడం, రంకె వేయడం, మేత మేయకపోవడం, కనుగుడ్లు తిప్పడం, జ్వరం రావడం జరుగుతుంది. ఈ లక్షణాలు ఉంటే అవి వారం పది రోజుల్లో చనిపోతాయి.

అందుబాటులో వ్యాక్సిన్...

యాంటి రేబీస్ వ్యాక్సిన్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జనరల్ ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఆసుపత్రులలో దాదాపు 18వేల వరకు వాయిల్స్ నిల్వ ఉన్నాయి. ఒక్కో వాయిల్‌లో 5 వ్యాక్సిన్‌ల చొప్పున ఉంటాయి. కుక్క కరిచిన వెంటనే స్థానిక ఆసుపత్రికి వెళితే ఉచితంగానే ఈ రేబిస్ టీకా వేస్తారు.

● నారాయణపేట: జిల్లా వ్యాప్తంగా పెంపుడు కుక్కలు 6636 ఉండగా, వీధికుక్కలు 19,500 వరకు ఉన్నాయి. పశువైద్యశాలల్లో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉండడం వల్ల పెంపుడు కుక్కలకు ఈ వ్యాక్సినేషన్ ఏడాదిలో ఒకసారి విధిగా వేస్తారు. పిల్లులకు సైతం వేస్తారు. నారాయణపేట పశువైద్యశాలలో ఆదివారం రేబిస్ వ్యాక్సినేషన్ వేయనున్నట్లు పశువైద్యాధికారి అనిరుధ్ తెలిపారు.ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టువరకు వరకు 3807కుక్కకాటు కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాలలో ర్యాబిస్ వ్యాక్సినేషన్ అందుబాటులో ఉందని డీఎంహెచ్ఓ జయచంద్ర మోహన్ తెలిపారు.



పేట పశువైద్యశాలలో పెంపుడు కుక్కకు రేబీస్ వ్యాక్సినేషన్ వేస్తున్న పశువైద్యాధికారి అనిరుధ్

గద్వాల జిల్లాలో 6144 దోసులు

గద్వాల క్రైం,(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 1536 మంది కుక్కకాటు బాధితులు ఉన్నారని ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్యాకిరణ్మయి తెలిపారు. వీరికి ఇప్పటివరకు 6144 డోసులు మందులను వేసినట్లు ఆమె తెలిపారు.

● అచ్చంపేట: కుక్క కరిచిన ప్రతీ ఒక్కరికి ఈ వ్యాక్సిన్ వేయించాలని వైద్యులు సూచిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2025 జనవరి నుంచి ఆగస్టు వరకు 1693 మంది కుక్క కాటుకు గురయ్యారని డాక్టర్ హరీశ్ తెలిపారు.

● వనపర్తి వైద్యవిభాగం, (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు నెల వరకు వనపర్తి జిల్లా వ్యాప్తంగా 2288 మంది కుక్క కాటుకు గురైయ్యారు. అలాంట వారితో పాటు ఇంట్లో పెంచుకుంటున్న కుక్క గీరినా, కొరికినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 11152 మంది యాంటీ రేబిస్ వ్యాక్సిన్ పొందినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు తెలిపారు.

టీకాలు వేయించాలి..

రేబీస్ వ్యాధిని నివారించేందుకు ప్రతీ కుక్క, గేదె, ఆవులకు కచ్చితంగా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధికి చికిత్స అందుబాటు లోకి రాలేదు. ముందస్తు జాగ్రత్తలు చాలా అవసరం. ముఖ్యంగా పెంపుడు కుక్కలకు 12 వారాలలో ఒక డోసు, 16వ వారంలో రెండో డోసు, సంవత్సరం తర్వాత మరో డోసు టీకాలు వేయించాలి. ప్రతీ ఏడాది దీని ప్రకారం వేయించాలి. అదేవిధంగా వ్యాధిసోకిన కుక్కకు, లేదా పశువులకు మొదటి రోజు, 3వ రోజు, 7వ రోజు, 11వ రోజు, 28వ రోజు టీకా వేయించాలి. పిచ్చికుక్కలకు దూరంగా ఉండేటట్లు చూసుకోవాలి. ఒకవేళ వ్యాధి సోకిన కుక్క లేదా పశువులు చనిపోతే వాటిని కాల్చడం, గుంత తీసి పూడ్చిపెట్టడం చేయాలి.

- వెటర్నరీ డాక్టర్ వరుణ్, మహబూబ్‌నగర్

ఐక్య ఉద్యమాలే శరణ్యం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య

కల్వకుర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో ఎల్ఐసీ-ఐసీఈయూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ 33వ అన్యువల్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. భారత రాజ్యాంగం-ఆర్థి ప్రగతిలో ప్రభుత్వరంగం అనే అంశంపై జరిగిన సెమినార్‌కు ప్రధాన వక్తలుగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, ఎల్ఐసీ సౌత్ జోన్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్యలు హాజరయ్యారు. అంతకు ముందు అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వివిధ ప్రజాసంఘాలు సీఐటీయూ, యూటీఎఫ్, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు ర్యాలీగా బయల్దేరారు. అనంతరం జరిగిన సెమినార్‌లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య మాట్లాడారు.

ఎల్ఐసీ-ఐసీఈయూ హైద్రాబాద్ బ్రాంచ్ నాయకులు మధు, కల్వకుర్తి బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు హసేన్‌పాషా, లక్ష్మణాచారి, కోశాధికారి నాగేష్, స్రవంతి, నిరంజనమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.ఆంజనేయులు, ఆర్.శ్రీనివాసులు, యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు ఏపీ మల్లయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరుశరాములు, యూటీఎఫ్ సీనియర్ నాయకుడు చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చింత ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి, ఎల్ఐసీ ఏజెంట్లు యూనియన్ లియాఫీ నాయకులు తాళ్ల వెంకటయ్య గౌడ్, సీపీఎం నాయకులు కృష్ణారెడ్డి, బాలస్వామి, శివరాములు, ఎల్.బక్కయ్య, పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

» లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించిన న్యాయమూర్తి కళ్యాణ్‌చక్రవర్తి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి

హన్వాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను న్యాయ బద్ధంగా పరిష్కరించుకునేందుకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పని చేస్తుందని, ఈ సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ న్యాయాధికారి కె.కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం హన్వాడ తహసీల్దార్ కార్యాలయంలోని అదనపు భవనంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను న్యాయాధికారి కళ్యాణ్‌చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలతో క్లినిక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల కోసమే ఈ ఎయిడ్ క్లినిక్‌ను హన్వాడలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూచనలు, సలహాలు అందించేందుకు పారా లీగల్ వలంటీర్‌ను నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సీనియర్ సివిల్ న్యాయాధికారి డి.ఇందిర, ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి రవిశంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి, తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపీడీవో యాశోదమ్మ, ఎంఈవో గోపాల్ నాయక్, రవినాయక్, యోగేశ్వర్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతుల కార్యక్రమంలో డి.ఇందిర, రవిశంకర్ పాల్గొని మట్లాడారు. చట్టాలపై కనీస అవగాహనను కల్పించే బాధ్యతను తీ సుకోవాలని సూచించారు.

జాతీయ మానసిక ఆరోగ్య సర్వే విజయవంతం

శ్రీరంగాపురం సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగాపూర్ గ్రామంలో జాతీయ మానసిక ఆరోగ్య సర్వే-2 విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సర్వేను ఏఐఎంఎస్ బీబీనగర్, నిమ్హాన్స్ బెంగళూరు ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్స్ డాక్టర్ వామన్ కుల్కర్ని, డాక్టర్ సాయికృష్ణ తిక్కా మార్గదర్శకత్వంలో, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాముడు పర్యవేక్షణలో నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 36 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుగుతున్న ఈ భారీ అధ్యయనంలో 18 ఏళ్ల పైబడిన పెద్దలు, 13-17 ఏళ్ల కౌమారదశ వయసులలో మానసిక ఆరోగ్య సమస్యల ప్రాబల్యం, నమూనాలు, లక్షణాలను అంచనా వేయడం లక్ష్యంగా ఎంఎస్ఆర్‌పీ-పీపీఎస్ పద్ధతిలో బహుళ దశ స్తరికరించబడిన, యాదృచ్ఛిక క్లస్టర్ నమూనాలు ఉపయోగిస్తున్నారు. జిల్లాల ఎంపికలో నీతి అయోగ్ పేదరిక సూచిక, పట్టణ- గ్రామీణ కేటాయింపు, గిరిజన ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం కల్పించారు. శ్రీరంగాపూర్ సర్వేలో మానసిక ఒత్తిడి, డిప్రెషన్, వృద్ధాప్య సమస్యలు, మద్యపానం, మహిళల ఆరోగ్యం, పిల్లల పోషణ వంటి అంశాలపై దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ బ్రోచర్లు పంపిణీ చేశారు. ప్రాథమిక వైద్య సలహాలు అందించడం జరిగిందని స్థానిక వైద్యులు, డాక్టర్ రాములు తెలిపారు. ఏఎన్ఎం శ్రీదేవి, ఆశావర్కర్లు కె.జ్యోతి, కె.కల్పన, సహకారంతో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య బృంద సభ్యులు వినిత, తిరుపతి, మణికంఠ, రంజిత్‌యాదవ్ సర్వేను విజయవంతంగా పూర్తి చేశారు. మానసిక సమస్యల కోసం 14416 టెలిమనస్ హెల్ప్‌లైన్ ద్వారా తక్షణ సలహా అందించే అవకాశాన్ని ప్రజలకు తెలియజేశారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న వైద్య బృందం

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

» జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి
» జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్.పి. వెంకటేశ్
» ఉత్సాహంగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్.పి. వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్.పి.వెంకటేశ్ అన్నారు. జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీని మూడో రోజు పోటీలు శనివారం జడ్చర్ల మైదానంలో నిర్వహించారు. పోటీలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫుట్‌బాల్ జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రదాన కార్యదర్శి భానుకిరణ్, అసోసియేషన్ ప్రతినిధులు గజానంద్‌కుమార్, నాగేశ్వర్, నందకిశోర్, క్రిష్టయ్య, మోయిన్, శ్రీనివాస్, శ్రీహరి, జెమ్స్, రామకృష్ణ, రామిరెడ్డి, నిరంజన్, నికేష్ పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన జట్లు ఇవే..

రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ రసవత్తంగా కొనసాగుతున్నది. శనివారం జరిగిన మొదట క్వార్టర్ ఫైనల్‌లో జరిగిన మ్యాచ్‌లో వనపర్తి జట్టు 2-3గోల్ తేడాతో మెదక్‌పై గెలిచింది. రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 1-0 రంగారెడ్డిపై విజయం సాధించింది. మూడో క్వార్టర్ ఫైనల్‌లో కరీంనగర్ జట్టు 1-0తో సిద్దిపేటపై, నాలుగో క్వార్టర్ ఫైనల్‌లో గద్వాల జట్టు 3-1తో ఆదిలాబాద్‌పై గెలిచి సెమీస్‌కు చేరాయి. ఆదివారం సెమీఫైనల్‌లో మహబూబ్‌నగర్ వర్సెస్ వనపర్తి, గద్వాల వర్సెస్ కరీంనగర్ జట్లు తలబడుతాయి.



తలబడుతున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి జట్లు

కేసులు నమోదు చేయడం సరైంది కాదు

» బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగూరావు నామాజీ

ఆత్మకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హిందువులు, ముస్లింలు ఒకరిపై ఒకరు కేసులు నమోదు చేయకుండానే బీజేపీ కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం సరైంది కాదని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కమిటీ అధ్యక్షుడు నాగూరావు నామోజీ ఆరోపించారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించిన అనంతరం శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 4వ తేదీన ఆత్మకూర్ గాంధీ చౌరస్తాలో హిందూ సంఘాలు చేసిన నిరసనలో ఉద్దేశపూర్వకంగా బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం సరైనది కాదని డిమాండ్ చేశారు. నగరంలో వినాయక చవితి సందర్భంగా హిందువులు కాషాయం జెండాలు కట్టడం అదే రోజు రాత్రికి రాత్రి ముస్లింలు పచ్చ జెండాలను కట్టడాన్ని నిరసిస్తూ, పార్టీలకు అతీతంగా నిరసన వ్యక్తం చేస్తే పోలీసులు ఇరు పక్షాల వారిని పిలిచి సముదాయించి సర్ది చెప్పడం పోయి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆత్మకూరులో బీజేపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరైనది కాదని జిల్లా ఎస్పీ కలుగజేసుకుని సముదాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. వనపర్తి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు మెర్వ రాజు, ఆత్మకూరు అమరచింత మండలాల అధ్యక్షుడు అశోక్, భూపాల్, మంగ లావణ్య, జిల్లా నాయకులు దేవరపల్లి అంజనేయులు, ఆనంద్, తమ్మలి విజయ్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్ గౌడ్‌తో పాటు మండల నాయకులు సూరితో పాటు మండల నాయకులు సూరి, మాసన్న, ఎల్లన్న, తోపాటు యూత్ నాయకులు పాల్గొన్నారు.

రన్నర్‌గా మహబూబ్‌నగర్



రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీలో రన్నర్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా బాలురు జట్టు

» అండర్-19 బాలుర ఫుట్‌బాల్ టోర్నమెంట్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనగాంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ బాలుర జట్టు రన్నర్‌గా నిలిచింది. ఉమ్మడి జిల్లా జట్టు రన్నర్‌గా నిలువడం పట్ల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి అభినందించారు. అదే విధంగా మహబూబాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 ఉషూ టోర్నీలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. క్రీడాకారుడు తులసీరామ్ బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపి కైనట్లు తెలిపారు.

నేడు ఆర్గానిక్ రైతుల సమావేశం

పాలమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్గానిక్ రైతుల ముకుంద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పురుగుల మందులు వాడకుండా సేంద్రియ వ్యవసాయం చేసే రైతులు సమావేశమై సంఘం ఏర్పాటు చేసుకునేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. గ్రీన్ ఆర్గానిక్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధి రమేష్‌బాబు సేంద్రియ ఎరువు వితరణ ఉంటుందని తెలిపారు.

'గ్రామ కంఠం భూమిని ఎలా అమ్ముకుంటారు'

మహమ్మదాబాద్ సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా గ్రామ కఠం భూమిలో నవజీవన రిక్రియేషన్ క్లబ్ కొనసాగుతుండగా అట్టి భూమిని ఓ వ్యక్తికి పట్టదారు పాస్‌బుక్కు ఇచ్చి వేరే వారికి ఎలా అమ్ముకుంటారని బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహులు, గ్రామస్థులతో కలిసి శనివారం ధర్నా చేపట్టారు. ఈ స్థలం విషయంలో గతంలోనే తహల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కుర్వ కృష్ణ పాల్గొన్నారు.

మహిళలు గార్మెంట్ వ్యాపారంలో ఎదగాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల సభ్యులు గార్మెంట్ వ్యాపార రంగంలో ఎదగాలని డీఆర్‌డీఏ ఏపీడీ శారద పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో మైక్రో ఎంటర్ ప్రైజెస్ డెవలప్‌మెంట్ పథకం కింద ఎంపికైన భూత్పూర్ మండలం మహిళా సంఘం సభ్యులకు గార్మెంట్స్, స్కూల్ యూనిఫామ్స్‌లు కుట్టి ఆర్థికంగా నిలదొక్కుకునే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైక్రో డెవలప్‌మెంట్ పథకం కింద జిల్లాలో మహబూబ్‌నగర్, భూత్పూర్, కోయిల్‌కొండ మండలాలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మండలాల్లోని మహిళా సంఘాల సభ్యులకు గార్మెంట్స్ రంగంలో హైదరాబాద్‌లోని సెర్ప్‌లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. డీపీఎంలు రాంమూర్తి, లక్ష్మయ్య, ఏపీఎం సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

భూత్పూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్, ఎంపీటీసీ (స్థానిక సంస్థల) ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామస్థాయి ఎన్నికల అధికారులకు ఎంపీడీవో శ్రీదేవి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీవోస్, ఏపీవోస్, ఓపీవోసులకు నిర్వహించిన శిక్షణ తరగతిలో ఆమె మాట్లాడారు. శిక్షణ తగతులకు 439 మంది హాజరుకాగా, విడతల వారీగా శిక్షణ అందించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళిని అధికారులు తూచ తప్పకుండా పాటించాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నియమించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. టీవోటీస్ భైకాని బాలుయా దవ్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

జడ్చర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీకి చెందిన మిద్దె పల్లవి మెడిసిన్ విద్యాభ్యాసానికి ఆర్థిక సాయం అందిస్తానన్న హమీ మేరకు రూ.లక్ష ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అందజేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు రవి, లక్ష్మీకి ఎమ్మెల్యే పంపించిన రూ.లక్ష నగదును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ప్రస్తుతం మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న పల్లవికి ప్రతీ సంవత్సరం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తానని ఎమ్మెల్యే హమీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు నిత్యానందం, వెంకటేశం, సర్పరాజ్, లక్ష్మణ్ ఉన్నారు.

ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

పాలమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చే వరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ఆందోళన చేపట్టి, మాట్లాడారు. ట్రిబుల్ ఆర్ మూడో అలైన్‌మెంట్ తీసుకోవటంతో పేద, గిరిజన, దళిత, బలహీన వర్గాల రైతుల జీవితాలు చిద్రమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. గతంలో సేకరించిన రెండో అలైన్‌మెంట్ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పేద రైతుల పక్షాన సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. దీప్లానాయక్, రాజ్, భరత్, సురేష్, నిర్వాసితులు కృష్ణయ్య, శ్రీను, రమేష్, శ్రీశైలం, రాములు, కిషన్ పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

చిన్నచింతకుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.శనివారం చిన్న వడ్డెమాన్ గ్రామంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల స్థాయిలో మన వాయిస్ వినిపించాలంటే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాలని కోరారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

పాలమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి క్లాక్‌టవర్ మీదుగా భగత్‌సింగ్ విగ్రహం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. జిల్లా కో-కన్వీనర్ భానుప్రసాద్, ప్రవీణ్, విజయ్, వంశీ, భాస్కర్, అంజి, సాయిలు, ఈశ్వర్, శివ, దిలీప్, మహిమూద్ పాల్గొన్నారు.





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్
- ఘనంగా పర్యాటక దినోత్సవం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన వేడుకలు నిర్వహించగా, అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అనేక దర్శనీయ స్థలాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయన్నారు. ప్రత్యేకించి నల్లమల్ల అటవీ ప్రాంతం, జూరాల ప్రాజెక్టు, పిల్లల మర్రి, సోమశిల, కోయిల్‌సాగర్, సరళసాగర్, జోగులాంబ శక్తీపీఠం, కురుమూర్తి, మన్యకొండ వంటి అనేక ప్రసిద్ధ ఆలయాలు, ప్రకృతి రమణీయ స్థలాలు, వ్యూ పాయింట్స్ వంటి పర్యాటక ప్రదేశాల్లో స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పర్యాటకశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పర్యాటక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు బాలకేంద్రం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టీఎస్ఎస్ కళాకారులు పర్యాటక పాటలు పాడారు. ఆవకృత్యం, వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతు ప్రదానం చేశారు. డీఐఈఓ కౌసర్‌జహాన్, జిల్లా శిశుసంక్షేమశాఖ అధికారిని జరీనాబేగం, జిల్లా పౌరసరఫరాల అధికారి గంప శ్రీనివాస్, డీఎం రవినాయక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్, డీఆర్‌డీఏ అదనపు పీడీ శారద, టీఎన్‌జీవో అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగహన కల్పించాలి

విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని, అవగహన కల్పించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణపై వివిధ శాఖల అధికారులతో నార్కోటిక్ జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు డ్రగ్స్ నిర్మూలనకై అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

హమాలీలకు దసరా బోనస్

పౌర సరఫరాల సంస్థ మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్రలో మండల స్టాక్ పాయింట్లలో పని చేస్తున్న హమాలీలకు దసరా పండుగ పురస్కరించుకొని రూ.7,500 బోనస్, స్వీట్ బాక్స్, రెండు జతల యూనిఫామ్ అందజేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



మిడ్జిల్ ఎంపీడీవో కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/పాలమూరు/ జడ్చర్ల/దేవరకద్ర/మిడ్జిల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జిల్లా అధికారులు, ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా మహిళా శిశు, సంక్షేమ అధికారిని జరీనాబేగం, డీపీఆర్వో శ్రీనివాస్, డీఎస్‌వో శ్రీనివాస్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జనార్దన్, కలెక్టరేట్ ఏవో సువర్ణరాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీయర్ ఇస్రానాయక్ పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ అలుపెరగని పోరాట యోధుడని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విజయ్‌కుమార్, లక్ష్మీకాంత్, బుగ్గన్న, అజయ్‌కుమార్, శ్రీకాంత్, అశ్విని చంద్రశేఖర్, డీకే నాయి, మహేష్‌గౌడ్, నాగప్ప పాల్గొన్నారు. జడ్చర్లలో బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రం వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీనివాస్, జహంగీర్‌పాష, రాధాకృష్ణ, నరసింహులు, విజయ్‌కుమార్, బీంరాజ్, ఆనంద్ పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి చైర్‌పర్సన్ పుష్పలత, వైస్‌చైర్‌పర్సన్ పాలాదిసారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి, పూలమాల వేసి నివాళి అర్పించారు. దేవరకద్ర మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దీపిక, ఆర్ఐ శరత్‌కుమార్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు.

మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎంపీడీవో గీతాంజలి, ఇన్‌చార్జి తహసీల్దార్ భారతీ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి నివాళులర్పించారు.

బాలాత్రిపుర సుందరీగా అమ్మవారు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



లలితాత్రిపుర సందరీగా పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు



గాయత్రీ మాతగా వాసవీ అమ్మవారు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/జడ్చర్ల/నవాబ్‌పేట/దేవరకద్ర/హన్వాడ/చిన్నచింతకుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బ్రాహ్మణవాడి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారు బాలాత్రిపుర సుందరీగా, శ్రీనివాసకాలనీ వాసవీ మాత ఆలయంలో గాయత్రీ మాతగా అమ్మవారిని అలంకరించారు. రాత్రి బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. జడ్చర్ల మునిసిపాలిటీ సాయినగర్‌కాలనీ సకలదేవతల ఆలయంలో దుర్గామాత లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. వాసవీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో వారాహిదేవి అవతారంలో, విద్యానగర్‌కాలనీ రేణుక ఎల్లమ్మ ఆలయం, బంగారు మైసమ్మ ఆలయంలో లలితాంబిక దేవీగా దర్శనమిచ్చింది. నవాబ్‌పేట మండలం పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు, దేవరకద్ర మండల కేంద్రంలో అమ్మవారు, హన్వాడ మండల కేంద్రంతో పాటు ఇబ్రహింబాద్, పెద్దదర్పల్లి, టంకర, వేపూర్, షేక్‌పల్లి, కిష్టంపల్లి గ్రామాలతో పాటు చిన్నచింతకుంట మండలం ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో దుర్గామాతను లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చింది.

చిత్తూ.. చిత్తూల బొమ్మ



విద్యుత్ భవన్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

పాలమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిత్తూ.. చిత్తూల బొమ్మ శివుని ముద్దులగుమ్మ, బంగారు బొమ్మ దొరికెనమ్మ ఈ వాడలోన అంటూ.. శనివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. దసరా నవరాత్రి, బతుకమ్మ సంబురాల్లో భాగంగా ఎలక్ట్రిసిటీ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈడబ్ల్యూడబ్ల్యూఏ) కార్యదర్శి ఆసియా ముబిన్ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్‌లో టీజీఎస్‌పీడీసీఎల్, ట్రాన్స్‌కో మహిళా ఉద్యోగులు కోలాటం, బొడ్డెమ్మలు వేశారు. ముఖ్య అతిథులుగా ఎస్ఈ వెంకటరమేష్, డీఈ లక్ష్మణ్‌నాయక్, డీఈటీ నవీన్‌కుమార్ హాజరై ప్రసంగించారు. మహిళా ఉద్యోగులు పుష్పలత, శ్రీదేవి, బిందు, శ్రీలత, శ్యామల, వరలక్ష్మి పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : కలెక్టరేట్ ఆవరణలో శనివారం వివిధ శాఖలకు చెందిన మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. పరిశ్రమల శాఖ, మైనారిటీ శాఖ, బీసీ సంక్షేమాశాఖ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, కార్మికశాఖ, లీగల్ మెట్రాటజీ, టీఎస్‌రెడ్‌కో, షేడ్యూల్ కూలల అభివృద్ధిశాఖ, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే దీక్షలు

జడ్చర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలేపల్లి సెజ్ భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించే వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని యువజన సంఘాల నాయకులు వెల్లడించారు. జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామ సమీపంలోని భూ నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్ల వద్ద యువజన సంఘాల నాయకులు చేపట్టిన రిలే దీక్షలు శనివారం మూడో రోజుకు చేరాయి. గ్రామస్థులు రఘునందన్ చారి, యువజన సంఘాల నాయకులు ఉషానిసత్య, నరసింహ, యాదయ్య, కందూరి యాదయ్య, బాలస్వామిగౌడ్, నరసింహ, వెంకట్, చెన్నయ్య, యాదగిరి, కొంగలిరాజు, రాజు, రామస్వామి పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రకాంత్, రాఘవేందర్‌రెడ్డి శనివారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఐటీసెల్ కన్వీనర్ వెంకటేష్, నాయకులు ఖాదర్, బాల్‌రాజ్, రామానాయుడు, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ వార్డుల రిజర్వేషన్లు ఖరారు

భూత్పూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులు నిర్వహించిన గ్రామ పంచాయతీల వార్డులకు సంబంధించిన రిజర్వేషన్లు లక్కీ డిప్ ద్వారా ఖరారు చేశారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు గాను 174 వార్డులు ఉన్నాయి. ఎస్టీ మహిళ-13, ఎస్టీ జనరల్-14, ఎస్సీ మహిళ-12, ఎస్సీ జనరల్-19, బీసీ మహిళ-28, బీసీ జనరల్- 37, అన్‌రిజర్వు మహిళ-21, అన్‌రిజర్వు జనరల్-30 కేటాయించారు.

● హన్వాడ : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో, ఎంపీవో, అన్ని పార్టీల నాయకుల ఆధ్వర్యంలో లక్కి డిప్ తీశారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో 302 వార్డులు ఉన్నాయి. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లలో 50 శాతం మహిళలకు లక్కి డిప్‌తో రిజర్వేషన్లు ఖరారు చేశారు. 151 మంది మహిళలు, 151 పురుషులకు కేటాయించారు.

● మిడ్జిల్ : ఎంపీడీవో సమావేశ మందిరంలో గ్రామాల వారిగా వార్డు సభ్యుల మహిళా రిజర్వేషన్లను లక్కి డిప్ ద్వారా ఎంపిక చేశారు. మండలంలో 204 వార్డులు ఉండగా, 91 వార్డులలో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నాయి. లక్కీడిప్ ద్వారా ఎస్టీ 18, ఎస్సీ 18, బీసీ 33, జనరల్ ఉమెన్ 22గా అధికారులు నిర్ధారించారు. అంతకుముందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో గీతంజాలి, ఎంపీవో నసీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

● మహమ్మదాబాద్ : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 186 వార్డులు ఉండగా ఎంపీడీవో నరేందర్‌రెడ్డి లక్కీ డిప్ ద్వారా రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఎస్టీలకు 64 కేటాయించగా, అందులో 30 మహిళలు, 34 పురుషులకు, ఎస్సీ కేటగిరిలో 16కు గాను 6 మహిళలు, 10 పురుషులకు, బీసీ కేటగిరిలో 60 వార్డులకు 27 మహిళలు, 33 పురుషులకు కేటాయించారు. జనరల్ కేటగిరిలో 46 కేటాయించగా, 19 మహిళలు, 27 పురుషులకు కేటాయించారు.

జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్థానిక సంస్థలకు అధికారులు శనివారం జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీల రిజర్వేన్లను ప్రకటించారు. జిల్లాలోని 16 మండలాల జడ్పీటీసీలకు రిజర్వేషన్లను ప్రకటించారు. దీంతో ఎన్నికలలో పోటీ చేయాలని భావించిన ఆశావహులు ఆశలు రిజర్వేషన్ల ప్రకటన తర్వాత గల్లంతయ్యాయి. వారికి అనుగుణంగా కాకుండా ఇతరులకు దక్కడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లు

మండలం	ఎంపీపీ	జడ్పీటీసీ
అడ్డాకుల	బీసీ జనరల్	బీసీ మహిళ
మహబూబ్‌నగర్	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
మూసాపేట	ఓసీ జనరల్ మహిళ	ఓసీ జనరల్ మహిళ
దేవరకద్ర	ఓసీ జనరల్	ఓసీ జనరల్
భూత్పూర్	బీసీ మహిళ	బీసీ జనరల్
కౌకుంట్ల	బీసీ జనరల్	బీసీ జనరల్
జడ్చర్ల	ఎస్సీ మహిళ	ఎస్టీ జనరల్
సీసీకుంట	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
మహ్మదాబాద్	ఎస్టీ మహిళ	ఎస్టీ మహిళ
నవాబ్‌పేట	బీసీ జనరల్	ఎస్సీ మహిళ
హన్వాడ	బీసీ మహిళ	బీసీ జనరల్
గండీడ్	బీసీ జనరల్	బీసీ మహిళ
మిడ్జిల్	బీసీ మహిళ	బీసీ జనరల్
కోయిలకొండ	ఎస్టీ జనరల్	బీసీ మహిళ
బాలనగర్	ఓసీ మహిళ	ఓసీ మహిళ
రాజాపూర్	ఓసీ జనరల్	ఓసీ జనరల్

అడ్డాకుల మండల సర్పంచుల రిజర్వేషన్లు

గ్రామం	రిజర్వేషన్
అడ్డాకుల	ఓసీ
కాటవరం	బీసీ జనరల్
రాంచంద్రపూర్	బీసీ మహిళ
తిమ్మాయిపల్లి	బీసీ మహిళ
తిమ్మాయిపల్లితండా	ఎస్టీ
గుడిబండ	ఓసీ మహిళ
శాఖాపూర్	ఓసీ మహిళ
సుంకురామయ్యపల్లి	ఓసీ
కందూరు	బీసీ మహిళ
పొన్నకల్	బీసీ
రాచాల	ఎస్సీ
చిన్నమునగాల్‌చేడ్	బీసీ
పెద్దమునగాల్‌చేడ్	ఎస్సీ
బలీద్‌పల్లి	ఓసీ
కన్మనూరు	ఎస్సీ మహిళ
వర్నె	బీసీ మహిళ
ముత్యాంపల్లి	బీసీ
కొమిరెడ్డిపల్లి	బీసీ
నందిపేట	బీసీ మహిళ
వేముల	బీసీ మహిళ
జానంపేట	ఓసీ మహిళ
చక్రాపూర్	బీసీ
పోల్కంపల్లి	ఎస్సీ

అడ్డాకుల మండల ఎంపీటీసీ రిజర్వేషన్లు

గ్రామం	రిజర్వేషన్
అడ్డాకుల	జనరల్ (మహిళ)
గుడిబండ	జనరల్
కందూరు	జనరల్
పెద్దమునగాల్‌చేడ్	బీసీ(మహిళ)
బలీద్‌పల్లి	బీసీ (మహిళ)
వర్నె	ఎస్సీ(జనరల్)
పోన్నకల్	ఎస్టీ (మహిళ)
రాచాల	బీసీ (జనరల్)
తిమ్మాయిపల్లి	బీసీ (జనరల్)

మూసాపేట మండల ఎంపీటీసీ రిజర్వేషన్లు

గ్రామం	రిజర్వేషన్
నిజాలాపూర్	ఓసీ
మూసాపేట	ఓసీ జనరల్

హన్వాడ మండల ఎంపీటీసీ రిజర్వేషన్లు

గ్రామం	రిజర్వేషన్
పెద్దదర్పల్లి	బీసీ జనరల్
హన్వాడ-1	జనరల్ మహిళ
హన్వాడ -2	బీసీ మహిళ
సల్లోనిపల్లి	ఎస్టీ జనరల్
ఇబ్రహీంబాద్	బీసీ జనరల్
మాదారం	జనరల్ మహిళ
మునిమోక్షం	ఎస్సీ జనరల్
గొండ్యాల	బీసీ మహిళ
వేపూర్	బీసీ మహిళ
షేక్‌పల్లి	బీసీ జనరల్
బుద్దారం	ఎస్టీ మహిళ
టంకర	జనరల్
కొత్తపేట	ఎస్సీ మహిళ
కొనగట్టుపల్లి	జనరల్ మహిళ

భూత్పూర్ మండల ఎంపీటీసీ రిజర్వేషన్లు

గ్రామం	రిజర్వేషన్
తాటిపర్తి	బీసీ మహిళ
తాటికొండ-1	జనరల్ మహిళ
తాటికొండ-2	జనరల్ మహిళ
అన్నాసాగర్	బీసీ మహిళ
పోతులమడుగు	జనరల్
పాతమొల్గర	బీసీ మహిళ
కొత్తమొల్గర	బీసీ జనరల్
మద్దిగట్ల	ఎస్సీ మహిళ
వెల్కిచర్ల	బీసీ మహిళ
కర్వెన	బీసీ జనరల్

మూడేళ్ల బాలుడి ఊపిరితిత్తుల్లో సీతాఫల్ గింజ

- తొలగించి ప్రాణాలు కాపాడిన ఎస్వీఎస్ వైద్యులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల బాలుడి ఊపిరితిత్తుల్లో సీతాఫలం గింజ ఇరుక్కోవడంతో శనివారం ఎస్వీఎస్ వైద్యులు సర్జరీ చేసి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామానికి చెందిన మూడేళ్ల బాలుడు సీతాఫలం తింటుండగా ప్రమాదవశాత్తు గింజ ఊపిరితిత్తుల్లోకి జారి పడిపోయింది. తీవ్ర నొప్పితో పాటు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో ఎస్వీఎస్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు బాబుకు ప్రాణవాయువు 50 శాతం ఉందని గుర్తించి చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ సోరేన్ ఆధ్వర్యంలో సీటి స్కాన్ చేయించారు. ఎడమ పక్క శ్వాస నాళాలలో సీతాఫలం గింజ ఇరుక్కుపోయి ఊపిరితిత్తి మూసుకుపోయినట్లు గుర్తించి, వెంటనే ఊపిరితిత్తుల విభాగం ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అత్యాధునిక చిన్నపిల్లల రీజ్ డ్ బ్రాంకోస్కోపి పద్ధతి ద్వారా ఐదు నిమిషాల్లో ఆ గింజను తొలగించారు. వైద్య బృందాన్ని ఊపిరితిత్తుల విభాగాధిపతి డాక్టర్ ప్రద్యుత్ వ్యాగ్రే, ప్రొఫెసర్ కోటేశ్వర్‌రావు అభినందించారు. సర్జరీ చేసిన వైద్య బృందంలో డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సుమయ్య, డాక్టర్ ఐశ్వర్య, మత్తు డాక్టర్ వీణామేరీ ఉన్నారు.

పగిలిన మిషన్‌భగీరథ పైపులైను

జడ్చర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారి సబ్ రోడ్డులో శనివారం ఉదయం మిషన్ భగీరథ పైపులైను పగిలింది. దీంతో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సరఫరా అయ్యే స్వచ్ఛమైన తాగునీరు రోడ్డుపైకి ఎగిసిపడ్డాయి. కాగా ఆ దారి గుండా రాకపోకలు సాగించిన వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు నీటి సరఫరాను నిలిపివేసి, మరమ్మతు చేపట్టారు.

వ్యర్థాల తొలగింపునకు రూ.20.60 లక్షలు

జడ్చర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల తొలగింపునకు శనివారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి గ్రామానికి చెందిన పరశురాముడు దక్కించుకున్నాడు. వేలంలో నలుగురు పోటీ దారులు పాల్గొనగా రూ.20.60 లక్షలు పరశురాముడు దక్కించుకున్నాడు. మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సారిక ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామిని దర్శించుకున్న అదనపు కలెక్టర్

చిన్నచింతకుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి స్వామి శనివారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటయ్య శాలువాతో సన్మానించారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ

గండీడ్/మహమ్మదాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో జరిగే పనులపై టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తప్పిదాలకు పాల్పడితే చర్యలు తప్పవని అదనపు డీఆర్‌డీవో ముసాయిదా బేగం, అంబుడ్స్‌పర్సన్ సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.6.49 కోట్లకు గాను 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక 2వ రోజు కొనసాగుతుంది. గండీడ్, మహమ్మదాబాద్ మండలాల 49 గ్రామ పంచాయతీలకు 40 గ్రామ పంచాయతీలకు తనిఖీలో వివరాలు సేకరించారు. చాలా గ్రామాల్లో ఒకరికి బదులు మరొకరు పనులు చేసినట్లు, పని చేయనివారి పేర్లను మస్టర్లల్లో నమోదు చేసి ఖాతాలకు డబ్బులు వచ్చాయని తనిఖీ బృందం సభ్యులు అధికారులకు తెలిపారు. డీవీవో ప్రే మలత, ఎస్ఆర్‌పీ రాఘవులు, ఎంపీడీవో హరి చందర్ రెడ్డి, ఏపీవో హరిశ్చంద్రుడు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి బండప్రకాశ్ పరామర్శ



మణెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన బండప్రకాశ్

జడ్చర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకుడు దోరేపల్లి రవీందర్, జడ్చర్ల మునిసిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీరవీందర్‌ను శనివారం శాసన మండలి వైస్ చైర్మన్ బండప్రకాశ్ పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు దోరేపల్లి రవీందర్ తల్లి మణెమ్మ వారం రోజుల క్రితం మృతి చెందగా, విషయం తెలుసుకున్న బండ ప్రకాశ్ శపివానం రవీందర్‌ను పరామర్శించి, మణెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.